కోర్టు ఎదుట రోడ్డుపై ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసులో ఇరికించేందుకే కస్టడీ పిటిషన్

- పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టే అక్రమం
- కస్టడీ పిటిషన్‌లో రాజకీయ కోణం
- భూముల కోసమే తిరుగుబాటు
- నరేందర్‌రెడ్డి ప్రమేయం లేదు
- కోర్టులో పట్నం తరపు న్యాయవాదుల వాదనలు
- కొడంగల్ కోర్టులో విచారణ.. 22కు తీర్పు వాయిదా

కొడంగల్, నవంబర్ 20: లగచర్ల కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం కొడంగల్ కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు పట్నం నరేందర్‌రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం నరేందర్‌రెడ్డి తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. పోలీసులు పేర్కొన్న అంశాలపై నరేందర్‌రెడ్డి ఎటువంటి దాడులకు పాల్పడలేదని, అటువంటప్పుడు అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టడం తప్పు అని వారు తమ వాదనలు వినిపించారు. తమ భూములను కోల్పోతున్నామనే ఆవేదనతో లగచర్లలో ప్రజలు తిరగబడ్డారని, నరేందర్‌రెడ్డి సహా ఏ రాజకీయ నాయకుల ప్రమేయంతో, కుట్రతో కానీ ఈ ఘటన జరగలేదని తెలిపారు. నరేందర్‌రెడ్డిని పోలీసు కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని, పైఅధికారుల ఆదేశాల మేరకు పొలిటికల్ రివెంజ్‌తో ఇబ్బంది పెట్టాలని, కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో పోలీసులు కస్టడీకి అడిగారని కోర్టుకు వినిపించినట్టు న్యాయవాదులు తెలిపారు. కేసు విచారణపై తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసినట్లు తెలిపారు.

పోలీసుల పిటిషన్‌కు విచారణార్హత లేదు

నరేందర్‌రెడ్డిని పునర్మిచారణ చేయాలంటూ పోలీసులు వేసిన పిటిషన్‌కు ఎటువంటి అర్హత లేదని వాదించామని ఆయన తరపు న్యాయవాదులు తెలిపారు. గతంలో నరేందర్‌రెడ్డిని విచారించామని, కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఇచ్చారని పోలీసులు చెప్పినట్టు న్యాయవాదులు పేర్కొన్నారు. కానీ పోలీసులు పేర్కొన్న మాదిరిగా నరేందర్‌రెడ్డి ఎటువంటి స్టేట్‌మెంట్ ఇవ్వలేదని, జైలర్ సమక్షంలో అఫిడవిట్ తయారుచేసి ఆయన కోర్టుకు సమర్పించారని తెలిపారు. అన్యాయంగా రిమాండ్ చేశారని హైకోర్టులో పెట్టిన పిటిషన్‌పై విచారణ జరిగిందని, తీర్పు రిజర్వ్‌లో పేర్కొన్నారు. నరేందర్‌రెడ్డిని పోలీసుల కస్టడీకి ఇచ్చే ప్రసక్తి ఉండదని, రిమాండ్‌ను కూడా హైకోర్టు కచ్చితంగా కొట్టివేస్తుందని భావిస్తున్నట్టు తెలిపారు. నిందితుడు కన్ఫెషన్ ఇవ్వకుండా, కన్ఫెషన్ తీసుకున్నట్టు పోలీసులు చిత్రీకరించిన ఘటన.. తెలంగాణ జ్యుడీషియల్ చరిత్రలోనే మొదటిసారిదని పట్నం తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. తాను ఇవ్వకుండానే కన్ఫెషన్‌ను చిత్రీకరించారని జైలర్ సమక్షంలో జైలర్ ప్రామాణికతతో జడ్జికి పట్నం నరేందర్‌రెడ్డి లేఖ రాయడం, అఫిడవిట్ దాఖలు చేయడం మొదటిసారి అని పేర్కొన్నారు. తప్పుడు కేసులు పెట్టి జైలుకు తరలించినప్పుడు ఈ విధంగా జైలర్ సమక్షంలో అఫిడవిట్ దాఖలు చేయవచ్చని, లేఖ రాయవచ్చని తెలుసుకోవాలని పేర్కొన్నారు.

రేవంత్ పతనం స్టార్ట్: పట్నం

లగచర్ల నుంచే సీఎం రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమైందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారని, కేసులో తప్పకుండా నిర్దోషిగా తిరిగి బయటకు వస్తానని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారని న్యాయవాది చైతన్య వెల్లడించారు. రైతులకు మద్దతిస్తే అక్రమ కేసు పెట్టి అరెస్టు చేశారని సీఎం, పోలీసులు, ఇంటెలిజెన్స్ నిర్లక్ష్యం కారణంగానే ఆ దాడి జరిగిందని తెలిపారని వివరించారు. న్యాయస్థానంపై గౌరవం ఉన్నదని తెలిపారని చెప్పారు. కొడంగల్ ప్రజలు, రైతుల పక్షాన వందసార్లయినా జైలుకు వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని నరేందర్‌రెడ్డి చెప్పారని చైతన్య తెలిపారు. ఇదిలా ఉండగా, కొడంగల్ కోర్టుకు పట్నం నరేందర్‌రెడ్డి వచ్చినప్పుడు, విచారణ అనంతరం వెళ్లేప్పుడు అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

అక్రమ కూల్చివేతలపై నష్టపరిహారం కోరవచ్చు

బాధితులు సమక్షంలో ఆ భూములు సర్వే చేయాలి: హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని పట్టా భూముల్లో చట్టప్రకారం నిర్మించిన ఇండ్లను హైడ్రా అక్రమంగా కూల్చివేస్తే బాధితులు సంబంధిత అధికారుల నుంచి నష్టపరిహారాన్ని కోరవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. పటేల్‌గూడలో సర్వే నంబర్ 6లోని ప్రైవేట్ భూమితోపాటు సర్వే నంబర్ 12లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు తేల్చాలని సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఆ సర్వే పూర్తయ్యే వరకు అక్కడ యథాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే నంబర్ 12లోని ప్రభుత్వ భూమిలో ఇప్పటికే ఎవరైనా నివసిస్తున్నట్టయితే క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవచ్చని, ఆ దరఖాస్తులపై అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. పటేల్‌గూడలోని తమ ఇండ్లను హైడ్రా అధికారులు చట్ట విరుద్ధంగా కూల్చేస్తున్నారంటూ హైకోర్టులో దాఖలైన 22 పిటిషన్లపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. ఆ గ్రామంలోని సర్వే నంబర్ 6లో పట్టా భూములను కొనుగోలు చేశాక ఇండ్ల నిర్మాణాల కోసం పిటిషనర్లు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకున్నారని, అన్ని అనుమతులు పొందాకే ఇండ్లను నిర్మించుకున్నారని వారి తరపు న్యాయవాదులు వివరించారు. ప్రభుత్వం తరపు న్యాయవాది వాదన వినిపిస్తూ.. పిటిషనర్ల ఇండ్లు సర్వే నంబర్ 12లోని ప్రభుత్వ భూమిలో ఉన్నాయని తెలిపారు. ఆ భూమిని మండల సర్వేయర్ సర్వే చేశాక పిటిషనర్లకు నోటీసులు ఇచ్చామని, ఆ తర్వాతే కూల్చివేతలు చేపట్టామని చెప్పారు. హైకోర్టు స్పందిస్తూ.. తాము కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన సేల్ డీడ్‌లు ఉన్నాయని, నాలాతోపాటు ఇతర అనుమతులన్నీ పొందాకే ఇండ్లు నిర్మించుకున్నామని పిటిషనర్లు చెప్తున్నారని గుర్తుచేసింది. ఆ రెండు సర్వే నంబర్లలో సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని ఆదేశించింది.

లగచర్ల బాధితులకు అండగా గులాబీలు

- న్యాయం కోసం బీఆర్ఎస్ పోరాటం
- దేశం దృష్టిని ఆకర్షించిన కార్యాచరణ
- మద్దతు కూడగట్టడంలో సఫలం

కర్ఫ్యూను తలపిస్తున్న లగచర్ల గ్రామం

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): లగచర్ల ఉదంతం వెలుగుచూసినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీ ఆ తండావాసులకు తోడునీడగా కొనసాగుతున్నది. ఫార్మా కంపెనీ కోసం భూములు ఇవ్వని గిరిజనుల పట్ల రేవంత్‌రెడ్డి సర్కార్ సృష్టించిన భయానక వాతావరణం దేశం దృష్టిని ఆకర్షించేలా బీఆర్ఎస్ చేయగలిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సీఎం తన సొంత నియోజకవర్గ ప్రజల మనసులు గెలుచుకోలేకపోతున్నారనే విషయాన్ని బీఆర్ఎస్ ఆధారాలతో నిరూపించగలిగిందని జాతీయ మీడియా కథనాలే స్పష్టంగా చెప్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 'దేశంలో అనేక ప్రాంతాల్లో అధికార పార్టీ ప్రభుత్వ ప్రేరేపిత దాష్టీకాలు జరుగుతాయి. బీఆర్ఎస్‌లాగా బాధితుల పక్షాన ఇంత బాధ్యతగా ఒక అంశాన్ని నెత్తికెత్తుకున్న ఉదంతాలు ఇటీవలి కాలంలో తాము చూడలేదు' అని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ వ్యవహారాలను దగ్గరి నుంచి పరిశీలించే ఒక సామాజిక కార్యకర్త పేర్కొన్నారు. ఫార్మా కంపెనీల కోసం తన సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సాగిస్తున్న దురాగతాన్ని బీఆర్ఎస్ పార్టీ గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎండగడుతున్నది. పథకం ప్రకారం కరెంటు తీసి, అర్ధరాత్రి ఇండ్లలోకి చొరబడి, ఆడబిడ్డలతో అసభ్యంగా ప్రవర్తించిన పోలీసుల దురాగతాన్ని బీఆర్ఎస్ లోకానికి చాటిచెప్తున్నది. కొడంగల్‌లో జరిగిన అరాచకాలను, ఆగడాలను వెలికితీయాలని కన్నీటి పర్యంతమైన నేపథ్యాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీలో బట్టబయలు చేసింది. లగచర్ల దారుణాలను జాతీయ మానవహక్కుల కమిషన్, మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది.

మద్దతు కూడగట్టడంలో...

లగచర్ల బాధితులకు అండగా నిలిచి జాతీయ స్థాయిలో వారికి బాసటగా నిలవడంలో బీఆర్ఎస్ అనుసరించిన కార్యాచారణపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు. లంబాడా హక్కుల పోరాట సమితి, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక, భారత్ ముక్తి మోర్చా, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్లు సహా పలు ప్రజా సంఘాల మద్దతును కూడగట్టడంలో బీఆర్ఎస్ కార్యాచరణ తోడ్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ఫార్మా విలేజ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం నుంచి ఇప్పటివరకు నెలకొన్న పరిస్థితులపై దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి. మరోవైపు వికారాబాద్ జిల్లా యంత్రాగం నుంచి కానిస్టేబుళ్ల వరకు అసలేం జరిగిందో కూపీలాగుతున్నాయి.

పట్నం టెర్రరిస్టా.. పార్కులో అరెస్టా?

మొదటిపేజీ తరువాయి...

నిలదీసింది. నరేందర్‌రెడ్డి ఏమైనా ఉగ్రవాది అనుకుంటున్నారా.. అని నిప్పులు చెరిగింది. నరేందర్‌రెడ్డిని చట్ట నిబంధనలకు అనుగుణంగానే అరెస్టు చేశామన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)వాదనలతో విబేధించింది. వాకింగ్‌కు వెళ్లినప్పుడు పోలీసులు అరెస్టు చేయలేదని, ఆయనను ఇంట్లోనే అరెస్టు చేశారని పీపీ చెప్పగానే.. అరెస్టు విషయాన్ని ముందుగా నరేందర్‌రెడ్డి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా మూడో వ్యక్తికి ఎలా ఇస్తారని నిలదీసింది. నరేందర్‌రెడ్డి పరారీలో ఉన్నారా? అరెస్టు చేసే ముందు సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను ఎందుకు అమలు చేయలేదని నిగ్గదీసింది. అరెస్టు ప్రక్రియ నిబంధనలను పోలీసులు ఉల్లంఘించారని తీవ్రంగా ఆక్షేపించింది. లగచర్లలో ఫార్మా సిటీ కోసం భూసేకరణ నిమిత్తం కలెక్టర్, ఇతర అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా రైతులు తమ భూములు పోతాయనే ఆందోళనతో అధికారులపై దాడి చేశారు. ఈ ఘటనకు తెరవెనుక కుట్రదారుడు పట్నం నరేందర్‌రెడ్డి అని తేల్చిన పోలీసులు ఆయననే ప్రథమ నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేశారు. ఈ కేసులో కింది కోర్టు విధించిన రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ నరేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు.

కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వరా?

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ, నరేందర్‌రెడ్డి కేబీఆర్ పార్క్‌లో వాకింగ్ చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. అరెస్టు చేసే ముందు చట్ట ప్రకారం పిటిషనర్ కుటుంబసభ్యులకు కనీస సమాచారం ఇవ్వలేదని అన్నారు. కింది కోర్టు యాంత్రికంగా రిమాండ్ ఉత్తర్వులను జారీచేసిందని, వాటిని కొట్టివేయాలని కోరారు. ఈ దశలో పీపీ పల్లె నాగేశ్వర్‌రావు కల్పించుకుంటూ.. పిటిషనర్ నరేందర్‌రెడ్డిని ఆయన ఇంట్లోనే పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. ఇంట్లోనే అరెస్టు చేసి ఉంటే ఆ సమాచారాన్ని కుటుంబసభ్యులకో లేదా ఇంట్లో ఉన్న వాళ్లకో ఇవ్వకుండా సన్నిహితుడని చెప్తున్న సలీమ్ అనే థర్డ్ పర్సన్‌కు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఇలా చేయడం నిందితులను అరెస్టు చేసేందుకు అనుసరించాల్సిన నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని తప్పుపట్టింది. లగచర్ల ఘటనలో అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి తీవ్రగాయాలైనట్టు రిపోర్టు ఇచ్చిన పోలీసులు చిన్న గాయాలైనట్టు తిరిగి ఎలా రాశారని ప్రశ్నించింది. తిరిగి గండ్ర మోహన్‌రావు వాదనలు కొనసాగిస్తూ, నరేందర్‌రెడ్డిని పోలీసులు కుట్రపూరితంగా అరెస్టు చేశారని తెలిపారు. ఫార్మా సిటీ కోసం ప్రభుత్వం భూసేకరణ చేస్తే తాము భూముల్ని కోల్పోతామని రైతులు ఆందోళన చేశారని వివరించారు. లగచర్ల ఘటనకు 10 నుంచి 15 రోజుల ముందు పిటిషనర్ పట్నం నరేందర్‌రెడ్డి రైతులకు ఫోన్ చేశారని పీపీ చెప్పడంపై స్పందించిన హైకోర్టు.. పిటిషనర్ తన సన్నిహితుడికి రోజుకు ఒకటి, రెండు మించి కాల్స్ చేయలేదనే విషయం రికార్డులను పరిశీలిస్తే అర్థం అవుతున్నదని చెప్పింది.

గాయాలు పెద్దగా లేవని రిపోర్టులో ఉంది కదా?

మెడికల్ రిపోర్టును పరిశీలిస్తే, ఘటనలో గాయపడ్డ అధికారులకు పెద్ద గాయాలు లేవని స్పష్టమవుతున్నట్టు హైకోర్టు గుర్తుచేసింది. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో పిటిషన్‌పై తుది ఉత్తర్వులను జారీ చేస్తామన్న హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. అయితే, భోజన విరామ సమయం తర్వాత పీపీ పల్లె నాగేశ్వర్‌రావు తిరిగి వచ్చి, తమ వద్ద సాక్ష్యాధారాల వీడియో ఉందని, పోలీసుల చర్యలు చట్ట ప్రకారమే ఉన్నాయని, ఈ మేరకు రాతపూర్వక అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఇందుకు అనుమతి ఇచ్చిన న్యాయమూర్తి, తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు. ఈ కేసులో లక్ష్మయ్య మరో ఇద్దరి వాంగ్మూలాల ఆధారంగా నరేందర్‌రెడ్డిని అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నందున ఆ వాంగ్మూలాల నివేదికలను కూడా అందజేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ గురువారం జరగనుంది.

ఉగ్రవాదిలా అరెస్టు ఎందుకు చేశారు?

'మాజీ ఎమ్మెల్యేను ఓ ఉగ్రవాదిలాగా ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చింది. నరేందర్‌రెడ్డి ఏమైనా పరారీలో ఉన్నారా? సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను అమలు చేయకుండా ఎలా అరెస్టు చేస్తారు? దాడికి గురైన అధికారుల గాయాలపై సమగ్రంగా వివరాలు ఎందుకు ఇవ్వలేదు? తీవ్రగాయాలైనట్టు రిపోర్టు ఇచ్చి.. చిన్న గాయాలైనట్టు ఎలా రాస్తారు?' అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

రాజకీయ ప్రేరేపిత కేసు

'వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనకు పిటిషనర్‌కు సంబంధం లేదు. రాజకీయ ప్రేరేపితంతోనే ఆయనపై కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఈ నెల 13న జారీచేసిన రిమాండ్ ఉత్తర్వులు చట్ట విరుద్ధం. బొమ్రాస్‌పేట్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొడంగల్ కోర్టు యాంత్రికంగా ఆమోదించింది. ఈ నెల 2న లగచెర్ల గ్రామంలో జరిగిన సంఘటనకు సంబంధించి వికారాబాద్–సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ ఎస్ఎన్ శ్రీనివాస్‌రెడ్డి చేసిన ఫిర్యాదులో ఆరోపణలకు, పిటిషనర్‌కు సంబంధం లేదు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చేపట్టిన భూసేకరణ కోసం చేపట్టిన పబ్లిక్ హియరింగ్ సందర్భంగా..రైతులు తమ భూమి పోతుందనే భయాందోళనతో దాడి చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, నేరాంగీకార వాంగ్మూలాల ఆధారంగా పిటిషనర్‌ను అన్యాయంగా నిందితుడిగా చేర్చారు. కింది కోర్టు కూడా యాంత్రికంగా రిమాండ్ ఉత్తర్వులను జారీచేసింది. ఏకపక్ష ఉత్తర్వులను రద్దు చేయాలి. అరెసుకు ముందు పిటిషనర్ లేదా ఆయన భార్యకు కారణాలు చెప్పలేదు. ఈ నెల 13 నాటి రిమాండ్ కేసు డైరీని పరిశీలిస్తే అరెస్టుకు కారణాలు లేవు. నిందితులను పోలీసులు అరెస్టు చేసే ముందు అనుసరించాల్సిన విధివిధానాలపై డీకే బసు కేసులో సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేయలేదు. ప్రబీర్ పుర్కాయస్థ వర్సెస్ ఢిల్లీ కేసులో సుప్రీంకోర్టు, నిందితుల అరెస్టుకు కారణాలు (గ్రౌండ్ ఆఫ్ అరెస్ట్) గురించి వివరించింది. వీటిని కూడా పోలీసులు అమలుపర్చలేదు. పోలీసుల చర్యలు ఏకపక్షంగా, దుర్మార్గంగా ఉన్నాయి. రాజకీయ కక్షతో కేసు నమోదు చేశారు. పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండా అధికారులపై రైతులు రాళ్లు రువ్వేందుకు పిటిషనర్ ప్రోత్సహించారనే ఆరోపణలు అవాస్తవం. ఆధారాలు కూడా ఏమీ లేవు. ప్రజలు ఎవరూ కావాలని అధికారులపై దాడి చేయరు. అధికారులకు, దాడికి పాల్పడిన వ్యక్తులకు మధ్య ఎలాంటి శత్రుత్వం ఉండదు. కింది కోర్టు 13న జారీచేసిన రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలి' అని పట్నం తరపున న్యాయవాది టీవీ రమణారావు దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

పోలీసులపై కోర్టు ధిక్కరణ పిటిషన్

హైకోర్టులో పట్నం నరేందర్‌రెడ్డి భార్య శృతి దాఖలు

నేడు హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశం

హైదరాబాద్, నవంబర్ 20, నమస్తే తెలంగాణ: సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి తన భర్త కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారంటూ ఆయన భార్య పట్నం శృతి హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. చట్ట నిబంధనలను అమలు చేయకుండా ఏకపక్షంగా తన భర్తను అరెస్ట్ చేసిన పోలీసులపై తగు చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసే సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను డీకే బసు కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొన్నదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పోలీసులు అమలు చేయకపోవడం కోర్టుధిక్కారమే అవుతుందని తెలిపారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి తన భర్తను అరెస్ట్ చేసినందున పోలీసులపై చర్యలకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంలో ఐజీపీ వీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కే నారాయణరెడ్డి, బొమ్మరాస్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. వారిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు గురువారం విచారించే అవకాశం ఉన్నది.

బల్వంత్‌గౌడ్ (ఫైల్) సురేశ్(ఫైల్)

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

అప్పుల బాధ భరించలేక..

రంగారెడ్డి, మానుకోట జిల్లాల్లో బలవన్మరణం

మొయినాబాద్/నర్సింహులపేట, నవంబర్ 20: అప్పుల బాధ భరించలేక రంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన బల్వంత్ సిద్ధాంతిగౌడ్ (48) వ్యవసాయం చేయడంతోపాటు ప్రైవేటు ఉద్యోగం కూడా చేసేవాడు. వచ్చిన జీతంతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొన్నది. వ్యవసాయం చేయడానికి అప్పులు చేసి పెట్టుబడి పెట్టడంతో నష్టం వచ్చింది. సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక కొన్ని రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించాడు. పెద్దలు మందలించడంతో కొన్ని రోజులు బాగానే ఉన్నా అప్పులు అతన్ని వెంటాడుతునే ఉన్నాయి. చేసిన అప్పులు తీర్చడానికి మార్గం లేకపోవడంతో బుధవారం ఉదయం పొలంలో ఉన్న చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గోల్‌తండాలో యువరైతు..

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం గోల్ బోడ్కతండా గ్రామ పంచాయతీ పరిధిలోని గోల్‌తండాకు చెందిన రైతు లూనావత్ సురేశ్ (20)కు ఎకరం 10 గుంటల పొలం ఉన్నది. ఎకరంలో మిర్చి, 10 గుంటల్లో వరి సాగు చేశాడు. మిరప పంటకు పురుగు మందులు తడితర సాగు ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో భార్య పుస్తెలతాడు కుదువ పెట్టేందుకు ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో గొడవలు జరిగాయి. పంట పెట్టుబడికి డబ్బులేక, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన సురేశ్ ఈ నెల 14న పురుగుల మందు తాగడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి 'గ్రూప్-4' వెరిఫికేషన్

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్ శాఖలో టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 2300 గ్రూప్-4 అభ్యర్థులకు నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. 21, 22న వెరిఫికేషన్ ఉంటుందని వరంగల్, హైదరాబాద్ మున్సిపల్ శాఖ ప్రాంతీయ అధికారులు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. హైదరాబాద్ రీజియన్‌లో 95 జూనియర్ అసిస్టెంట్లు, 121 జూనియర్ అకౌంట్స్, 958 వార్డు ఆఫీసర్లు ఉన్నారు. వరంగల్ రిజియన్‌లో 75 జూనియర్ అసిస్టెంట్లు, 97 జూనియర్ అకౌంట్స్, 891 వార్డు ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని శాఖ అధికారులు తెలిపారు.

1100 కాదు.. 20 వేల ఎకరాలు

- ఒక్క లగచర్లలోనే 1100 ఎకరాలు
- ప్రభుత్వం పెడ్తానంటున్నవి 10 ఫార్మా విలేజ్‌లు
- ఈ లెక్కన కనీసం 20 వేల ఎకరాలు అవసరం
- గతంలోనే ప్రకటించిన రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): 'ఫార్మా విలేజ్‌ల కోసం 1100 ఎకరాలు సేకరిస్తుంటే మీకెందుకు కడుపుమంట?' అంటూ వేములవాడ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అయితే, సీఎం చెప్తున్నదాంట్లో ఎంతమాత్రమూ నిజం లేదు. 'సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తాం. ఒక్కో విలేజ్ 1000 నుంచి 2000 ఎకరాల్లో ఉంటుంది. ముందుగా వికారాబాద్, మెదక్, నల్లగొండలో ఈ విలేజ్‌లు ఏర్పాటు చేస్తాం'.. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా-2024 సదస్సు సందర్భంగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. దీనినిబట్టి చూస్తే ఫార్మా విలేజ్‌ల కోసం సేకరిస్తున్నది 1100 ఎకరాలు కాదని.. 10 వేల నుంచి 20 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందన్నది సుస్పష్టం. కానీ, బుధవారం వేములవాడ సభలో మాట్లాడుతూ 1100 ఎకరాలు మాత్రమే సేకరిస్తున్నట్టు నమ్మించే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దుచేస్తున్నట్టు ప్రకటించిన సీఎం.. రాష్ట్రవ్యాప్తంగా 1000-2000 ఎకరాల్లో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా మొదట వికారాబాద్, నల్లగొండ, మెదక్ జిల్లాల పరిధిలో వీటిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా, అక్కడ భూములు అందుబాటులో లేవని కలెక్టర్లు తేల్చారు. అయినా సరే, వికారాబాద్ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మాసిటీని ఏర్పాటు చేయాల్సిందేనని సీఎం సంకల్పించారు. అందులో భాగంగానే లగచర్ల ఘటన చోటుచేసుకున్నది. భూసేకరణ వ్యవహారం ఒక్క లగచర్లకే పరిమితమవుతుందా? లేక రాష్ట్రవ్యాప్తంగా చేపడతారా అన్న ప్రశ్న ఇప్పుడు అందరినీ వేధిస్తున్నది. ప్రభుత్వం ప్రతిపాదించినట్టుగా 10 ఫార్మావిలేజ్‌ల కోసం ప్రభుత్వ భూములు ఎక్కడా అందుబాటులో లేవు. అయినా సరే ప్రభుత్వం ముందుకెళ్తే రైతుల నుంచే భూసేకరణ చేయాల్సి వస్తుంది.

1400 ఎకరాల్లో ఫార్మాసిటీకి బీఆర్ఎస్ ప్రతిపాదన

ఫార్మారంగంలో రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా నిలిపే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని ముచ్చర్ల ప్రాంతంలో 14,029 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. మొ